క్లుప్తంగా

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ఎమ్మార్సీ కార్యాలయం నుంచి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సమీపంలోని కాలనీ వరకు ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో 400 మీటర్ల మేర సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. మూడు,నాలుగు రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. ఎమ్మార్సీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు గతంలోనే ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కాలనీలో వరకు రోడ్డు వేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

డోన్ టౌన్: ఎస్టీ రిజర్వేషన్ సాధనే వడ్డెరుల లక్ష్యమని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెరులు నేటికీ అన్నిరంగాల్లో వెనుకబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనకు చేపట్టాల్సిన భవిష్యత్ ప్రణాళికలు త్వరలో రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చిన్న మద్దిలేటి, శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటరాముడు, శ్రీనివాసులు, లక్ష్మన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో వ్యక్తి మృతి

సంజామల: వైఎస్ఆర్ జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన చెంతోటి మనోజ్ (26) మూర్ఛవ్యాధితో మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని నొస్సం గ్రామంలోని రైల్వే బ్రిడ్జ్ దగ్గర శనివారం మనోజ్ మూర్ఛ వ్యాధి మూలంగా కాళ్లు, చేతులు కొట్టుకుండగా గమనించిన కొందరు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించారని ఎస్ఐ చెప్పారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారన్నారు. మృతుడి తండ్రి చెంతోటి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో సోమ, మంగళ, బుధవారాలు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఏడీ మధు సూధన్‌రెడ్డి తెలిపారు. రైతులకు ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు గమనించగలరని తెలిపారు.

12,13 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నేల 12,13 తేదీల్లో అండర్-14,17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు. ఆయా పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావలన్నారు. 12వ తేదీన బాలికలకు, 13వ తేదీన బాలురకు క్రీడా పోటిలను నిర్వహిస్తున్న తెలిపారు. కబడ్డీ, కోకో, త్రోబాల్, బాల్ బ్యాట్మింటన్, వాలిబాల్, షటిల్ బ్యాట్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ తదితర తొమ్మిది క్రీడా అంశాలకు టోర్నమెంట్ కంసెలెక్షన్స్ ఉంటాయని ఎంఈఓ తెలిపారు.

ఆసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్: ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు ఆదివారం ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన లారెన్స్, మనోహర్ ఆర్థిక సాయం చేశారని జాన్ ప్రభాకర్ తెలిపారు. సంస్థ సభ్యులు నాగరాజుగౌడ్, రాజేష్, బాబా ఫక్రుద్దీన్‌లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామానికి చెందిన షేక్ మౌలాలి అనే వ్యక్తి ఈనెల 8వ తేదిన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులతోపాటు ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి తెలియలేదు. ఫోన్ సైతం పని చేయడం లేదు. షేక్ మౌలాలి అదృశ్యం అయ్యాడని తండ్రి రహంతుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక పెద్దరాజుస్వామి

- 12 నుంచి మూడురోజులపాటు ఉరుసు
- కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు



పెద్దరాజు స్వామి దర్గాకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి(ఫైల్)

బేతంచెర్ల : మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన పెద్దరాజుల స్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతోంది. శ్రీ హజరత్ సయ్యద్‌షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్‌బాషా ఉరఫ్ పెద్దరాజుల స్వామివారిని కులమతాలకు అతీతంగా కొలుస్తారు భక్తులు. దర్గాను దర్శించుకుంటే కష్టాలు మాయం అవుతాయని భక్తుల నమ్మకం. చారిత్రాత్మక నేపథ్యంలో కలిగిన పెద్దరాజుల స్వామివారికి ఇతర రాష్ట్రాల్లోనూ భక్తులు ఉన్నారు. ఇంటి దేవుడిగా వెలుగొందుతున్నారు. ఈనెల 12 నుంచి మూడు రోజలపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. 12వ తేదీన గంధం, 13న ఉరుసు, 14వ తేదీన జియారత్ కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్గా ముఖద్వారాన్ని ముస్తాబు చేశారు. గూటిపల్లె గ్రామంలో వందల ఏళ్ల క్రితం నిర్మించిన చారిత్రాత్మకమైన ఇద్రుస్ బాషా ఉరఫ్ పెద్దరాజులస్వామి మహిమలపై సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి.

చరిత్ర కలిగిన పెద్ద రాజుస్వామి దర్గా :

పెద్దరాజుల స్వామి 600 వందల సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా దేశంలోని జిద్దా సమీపంలోని అదన్ పట్టణంలో సయ్యద్ అబూబకర్ సుభాన్ ఇద్రూస్ వలి మక్కికు జేష్ఠ పుత్రుడిగా జన్మించారు. లోక కల్యాణార్థం పెద్దరాజుస్వామి 9 సంవత్సరాల వయసులోనే తల్లిదండ్రులను వదిలిపెట్టి భారతదేశానికి వచ్చినట్టు సమాచారం. మొట్ట మొదట కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్‌లో కొన్నేళ్లు నివాసం ఉండి అనంతరం ఆదోని పట్టణానికి వచ్చారు. ఇద్రూస్‌బాషాకు ముగ్గురు భార్యలు. ఇద్దరు భార్యలకు సంతానం లేదు. మొదటి భార్యకు మాత్రం ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 400 సంవత్సరాల క్రితం స్వామివారు అక్కడి నుంచి గూటుపల్లెకు వచ్చినట్లు చరిత్ర ఆధారాలు. అయితే అక్కడంతా దట్టమైన అడవి. ఈ ప్రాంతంలో యాదవులు ఆవులు, గొర్రెలు మేపుతూ జీవనం చేసేవారు. స్వామివారు తన తండ్రి ఆజ్ఞానుసారం చేతికర్రను తీసుకొని గూటుపల్లెలో నేడు ఉన్న దర్గా స్థలంలో నాలుగు రకాలుగా నమాజు చేసిన తర్వాత మిస్వాక్ పుల్ల మొక్కగా మారింది. ఆ వెంటనే రాత్రి పాతిన ఆసా తీసి వాసన చూడగా తన స్వగ్రామమైన ఆదోని భూమిలా వచ్చిందని, తన తండ్రి చెప్పినట్లుగా భావించిన స్వామివారు గూటుపల్లె గ్రామాన్ని స్థిరనివాసం ఏర్పాటుకు సంసిద్ధులయ్యారు. ఇక్కడ గ్రామానికి ఏర్పాటు చేసి ఖుదాపల్లె అని నామకరణం చేశారు. కాలక్రమేనా గూటుపల్లెగా మారింది. స్వామివారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని సంతతి ఇప్పుడు ఉన్న పీఠాధిపతుల వంశం.

స్వామివారి మహిమలు

ఇద్రుస్ బాషా ఉరఫ్ పెద్ద రాజు గూటు పల్లెలో స్థిర నివాసం నిర్ధారణ అయ్యాక మహిళలు చూపించారు. గొర్రెల కాపరుల భయం పోగొట్టేందుకు పులులను కొండ తీగలతో కట్టి తీసుకొచ్చినట్లు నానుడి. దీంతో ఇద్రుస్ బాషాకు పెద్దరాజు అని పేరు వచ్చినట్లు పూర్వికుల సమాచారం. పెద్దరాజులు స్వామిగా పేరొందారు. స్వామి వారి రెండవ కుమారుడు హుస్సేన్ షా బాషా మొండి గొడను నడిపించారని ప్రతీతి. ప్రతి గురువారం పెద్ద పులి వచ్చి తోకతో గర్భగుడిని శుభ్రం చేసేదని చరిత్ర చెబుతుంది. దర్గా ఆవరణలో దయ్యం, భూతం, పిశాచీలు, పీడలతో ఇబ్బందులు పడేవారు ఒక్క రోజు ఇక్కడ నిద్ర చేస్తే తొలిగిపోతాయని భక్తుల నమ్మకం. మొఘల్ సామ్రాజ్యపతనానికి కారకుడైన ఔరంగజేబు కూడా 1681లో ఈ గ్రామాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది. ఆ కాలంలోనే ఔరంగజేబు పెద్దరాజస్వామి వారికి వేలాది ఎకరాల మాన్యం ఇచ్చినట్లు రికార్డుల సమాచారం.

దర్గా 13వ పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బాష ఖాద్రీ



ఎంతో చారిత్రాత్మకమైన ఇద్రూసాబాషా దర్గాకు ఇప్పటి వరకు 13 మంది పీఠాధిపతులుగా వ్యవహరించారు. 14 సంవత్సరాల క్రితం 12వ పీఠాధిపతి అయిన సయ్యద్ హఖాని బాషా ఆకాల మరణంతో వంశ పారంపర్యంగా పీఠాధిపతిగా అతని కుమారుడైన సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ 6 సంవత్సరాల వయసులోనే 13పీఠాధి పతిగా బాధ్యతలు చేపట్టారు. గూటుపల్లెతో పాటు దేశంలోని 90 పీఠాలకు పీఠాధిపతిగా సయ్యద్ అక్బర్ బాష ఖాద్రీ వ్యవహరిస్తుండడం విశేషం.

ఉరుసుకు ప్రత్యేక ఏర్పాట్లు



మూడురోజుల పాటు పెద్దరాజులు స్వామి ఉరుసును భక్తిశ్రద్ధల మధ్య నిర్వహిస్తాం. ఈ మేరకు అన్ని ఏర్పాటు చేస్తున్నాం. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని వసుతులు సమకూర్చుతున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. భక్తులు దర్గాను దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలి.

– గురుసయ్యద్‌షా బాషా ఖాద్రీ, దర్గా నిర్వాహకులు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: సంజామల మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ్లల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ముదిగేడు, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

అన్నదాన సంస్థకు కుర్చీల విరాళం

బనగానపల్లెరూరల్ : మండంలోని టంగుటూరులో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి నిత్యన్నదాన సంస్థకు బేతంచర్ల మండలంలో ఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుమలేష్, మాధవి దంపతులు 40 డైనింగ్ కుర్చీలను విరాళంగా అందజేశారు. నిత్యన్నదాన సంస్థలో భక్తులు భోజనం చేసేందుకు అవసరమైన కుర్చీలను విరాళంగా అందజేసిన తిరుమలేష్, మాధవి దంపతులకు నిర్వాహకుడు రామగంగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



పల్లకీని మోస్తున్న దృశ్యం



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఆదివారం కృష్ణాష్టమి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి శ్రీకృష్ణుని ప్రతిమకు గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో శ్రీకృష్ణుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామపెద్దలు, భక్తులతో కలిసి జలదుర్గం ఎస్ఐ విజయ్ కుమార్ స్వామివారి పల్లకీని మోశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జమాల్, నిర్వాహకులు రామకృష్ణ, పుల్లయ్య, పవన్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకులో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి విగ్రహానికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మార్కెట్ వీధిలో వేప చెట్టు కింది ఏర్పాటు చేసిన స్వామి విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులుగావించి బస్టాండ్, తేరువీధి, సెంటర్, చాకలి వీధి, మున్నామార్కెట్ మీదుగా ఊరేగించారు. అవుకు బలిజసంఘం పెద్దలు కంపిలి నారాయణ, కునుకుంట్ల రామన్న, వేటూరి రమణ, వెంకటేశ్వర్లు పాటు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు నరేంద్ర, జయనాగేంద్ర ప్రసాద్, జయప్రసాద్, చంద్రమోహన్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి



గురువులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: పౌరులకు విజ్ఞానం అందించే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 2004-05 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ముందుగా పాఠశాల వ్యవస్థాపకులు శేషారెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం హెచ్ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు కుమారి, సత్యమ్మ, రత్నమ్మ, మధు సూదన్, వెంకటరెడ్డి, వెంకట్రావు, ఆనంద్, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసులును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సుదర్శన్‌రెడ్డి, శివ ప్రసాద్, శమీర్, మహేష్, ఇద్రూస్, శ్రీనివాసులు, రమేష్, సురేష్, సుమలత, సుప్రియ, మాధవి లత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నా,చెల్లెలికి తీవ్రగాయాలు



తీవ్రగాయాల పాలైన మధు శేఖర్,నాగలక్ష్మి

బేతంచెర్ల: పట్టణ సమీపాన కొలుములపల్లె రహదారిలో పాము అడ్డురావడంతో తప్పించేక్రమంలో ద్విచక్రవాహనం బోల్తపడిన సంఘటనలో ఆదివారం అన్న, చెల్లెలికి తీవ్రయాలయ్యాయి. కొలుములపల్లె గ్రామానికి చెందిన నాగలక్ష్మి కుమార్తె పాణ్యంలో చదువుతోంది. నాగలక్ష్మి తన అన్నతో కలిసి బైక్‌పై కుమార్తెను చూసేందుకు బయలు దేరారు. అయితే పట్టణానికి సమీపాన రైస్‌మిల్ వద్ద రహదారిపై పాము అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ బోల్తా పడింది. అన్నాచెల్లెలకు తీవ్రగాయాలు కావడంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారిని శేషారెడ్డి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

సమాజసేవలో యువత పాలు పంచుకోవాలి



గోడ గడియారం, బస్టాండ్ చిత్రాలను అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: యువత సమాజ సేవాలో పాలు పంచుకోవాని, పలువురికి ఆదర్శంగా నిలువాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబులేరెడ్డి, ఉర్దూఅకాడమీ సభ్యులు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన వన్నూర్ సాహెబ్ గోడ గడియారంతోపాటు, బస్టాండ్‌కు సంబంధించి 'నాడు-నేడు' తీరును తెలిపే చిత్రపటాలను ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో కంట్రోలర్ నాయుడికి అందజేశారు. వన్నూర్ సాహెబ్ సమాజ సేవకు అందిస్తున్న తోడ్పాటును వారు అభినందించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు ముస్తఫా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

బాబు శిక్షార్హుడే...

అవుకు : 'స్కిల్' కుంభకోణంలో అరెస్టు అయిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శిక్షార్హుడేనని ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. రూ. 371 కోట్లు కుంభకోణంలో బాబు పాత్ర ఉన్నట్లు ఆధారాలు ఉన్నందునే అరెస్టు అయ్యారని, ఏసీబీ కోర్టు సైతం రిమాండ్ విధించిందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే అనే విషయానికి ఇదో మంచి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజాధానాన్ని లూటీ చేసిన మొత్తాన్ని బాబు నుంచి రికవరీ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బేతంచెర్ల: స్కిల్ కుంభకోణంలో అరెస్టు అయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శిక్షార్హుడేనని రహిమానుపురం సర్పంచ్ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడినందునే అరెస్టు అయ్యారని, కోర్టు రిమాండ్ విధించిందన్నారు.


కోవెలకుంట్ల: స్కిల్ కుంభకోణంలో ఏ- వన్ ముద్దాయి అయిన తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిందని వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికార హోదాలో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోపిడీ చేశారన్నారు. స్కిల్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోగా అక్రమంగా అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై టీడీపీ నేతలు బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఏసీబీ కోర్టు చంద్రబాబుకు 14 రోజులు రిమాండ్ విధించి చట్టం ముందూ అందరూ సమానులేనని తీర్పు ఇవ్వడం శుభ పరిణామమన్నారు.

ఐక్యతతో పల్లెల అభివృద్ధి సాధ్యం

- పాండురంగస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి



శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పడగొట్టే పనులను ప్రారంభిస్తున్న పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు



పూజల అనంతరం పండితుడు గాలిగోపురాన్ని పడగొడుతున్న దృశ్యం

అవుకు: ఐకమత్యతతోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని, ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు ఆ దిశగా ముందుకు సాగాలని పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుండ్లశింగవరంలో వెలసిన గోదా రంగనాయకి పాండురంగస్వామి పురాతన ఆలయ పునః నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ముందుగా గోపూజ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణ పరిధిలోని రవ్వలకొండ వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ చేశారు. గుడి నిర్మాణానికి 26 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన దొంతా వెంకటేశ్వర్లు దంపతులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సత్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గౌడ సంఘం నాయకులు సన్మానించారు. ఐకమత్యంగా గుడిని నిర్మించుకోవాలని, తనవంతు సహకారం అందజేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఈడిగ పెద్ద వెంకటరమణగౌడ్, చిన్న వెంకటరమణ, దేవుడు, నారాయణ, పసుపల సర్పంచ్ మోహన్‌బాబు, విజయగౌడ్, రామచంద్రగౌడ్, కొండయ్యగౌడ్, కిట్టయ్యగౌడ్, నాగార్జునగౌడ్, పెద్దపాపోడు, వెంకట సుబ్బయ్య, శేఖర్, రామాంజనేయులు, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించాలి



నంద్యాల - ఎర్రగుంట్ల డెమో రైలు (ఫైల్)

బనగానపల్లె: నంద్యాల నుంచి కడప వరకు వెళ్తున్న డెమో రైలు రేణిగుంట వరకు వెళ్లేందుకు రైల్వేశాఖ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసున్నారు. ఈ రైలును రేణిగుంట వరకు కొనసాగించాలని కోరుతున్నారు. నంద్యాల – కడప డెమో రైలు రేణిగుంట వరకు పొడిస్తున్నట్లు రైల్వేశాఖ ప్రతిపాదనలు ఉన్నాయని కేంద్ర మంత్రి కూడా ప్రటించడం జరిగింది. అయితే రైల్వేశాఖ అధికారులు పట్టించుకోనందున ప్రయాణికులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

సమయం ఉన్నా...పొడిగించని వైనం

నంద్యాల నుంచి ప్రతి రోజు ఉదయం 6 గంటలకు బయల్దేరే డెమో రైలు కడపకు సుమారు పది గంటలకు చేరుకుంటుంది. అప్పటి నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కడప రైల్వేస్టేషన్‌లో సైడింగ్ భాగంలో నిలుపుతారు. దాదాపు 7-30 గంటల పాటు డెమో రైలు ఖాళీగానే ఉంటుంది. ఈ సమయంలో కడప నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేణిగుంటకు వెళ్లి రావచ్చనని రైల్వే అధికారులే అంటున్నారు. ఆ దిశగా రైల్వే అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల, బనగానపల్లె కోవెలకుంట్ల జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతా నుంచి తిరుమలకు ప్రయాణికులు ఎక్కువగానే ఉంటారు. అదేవిధంగా విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. అయితే రైలు సౌకర్యంలేనందున ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుంది. ప్రత్యేకించి వృద్ధులు, మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుని డెమో రైల్‌ను రేణిగుంట వరకు పొడగించాల్సిన అవసరం ఉంది.

చలనంలేని ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రతిపాదన

నంద్యాల కడప మీదుగా తిరుపతి వెళ్లు ఎక్స్‌ప్రెస్ రైలు చెన్నై వరకు పొడిగించాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా రైల్వే అధికారుల వద్ద ఉన్నాయి. ఈ రైలు రాత్రి వెళ్లలో వెళ్తనందున రైల్వే స్టేషన్లకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పగటిపూట ఈ రైల్వేమార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ధర్మవరం నుంచి విజయవాడ వెళ్లు ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి వేల వెళ్తున్న విషయం తెలిసిందే. పగలు సమయంలోను అదనంగా మరో ఎక్స్‌ప్రెస్ రైలు నడుపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు వాస్తవమే

నంద్యాల కడప డెమో రైలు రేణిగుంట వరకు వెళ్లేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అధికారికంగా ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడంలేదు. నంద్యాల బనగానపల్లె మీదుగా తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు చైన్నై వరకు వెళ్లేందుకు కూడా అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. నంద్యాల ఎర్రగుంట్ల మార్గంలో మరిన్ని అదనపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపె ప్రతిపాదనలు ఉన్న విషయం వాస్తవమే.

– మౌలాలీ, రైల్వే స్టేషన్ మాస్టర్, బనగానపల్లె

రైల్వే అధికారులు స్పందించాలి



ప్రతి రోజు నంద్యాల బనగానపల్లె కోవెలకుంట్ల తదితర ప్రాంతాల మీదుగా తిరుపతికి ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటారు. నంద్యాల నుంచి వెళ్లు డెమో రైలు రేణికుంట వరకు వెళ్లనందున ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రయాణంతో సమయం ఆదాతో పాటు చార్జీ తక్కువగా ఉంటుంది. పేద ప్రజలకు ఎంతో ఉపయోకరం.

– వెంకటేశ్వర్లు, రైతు కాపులపల్లి, బనగానపల్లె మండలం

రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి



నంద్యాల నుంచి వెళ్లు డెమో రైలు రేణిగుంట వరకు పొడగించాలన్న ప్రతిపాదనలపై రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు కడపలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ రైలు ఖాళీగానే ఉంటుంది. ఆ సమయంలో రేణిగుంట వరకువెళ్లీ రావచ్చు. ఆ దిశగా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– అబ్దుల్‌ఖైర్, ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్

మైనార్టీలను ఆదరించింది వైఎస్సార్‌సీపీనే

బొమ్మలసత్రం: ముస్లిం, మైనార్టీలను ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌సలామ్ కుటుంబ సభ్యుల గురించి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఉద్యోగంతో పాటు రూ.25 లక్షల పరిహారం అందజేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీల పట్ల ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుండటాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, ఆరిఫ్, తబ్రేజ్, సమ్మద్ పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. శ్రావణమాసం, వివాహాలు ఉండటంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ గంగా, ఉమాసమేత ఓంకార సిద్దేశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.